క్లుప్తంగా

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం శోచనీయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన వసతులు అందడం లేదన్నారు. ముఖ్యంగా జీవోనంబరు 36 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో నాయకులు పరిమి రవి, దాసు, కండెల శ్రీను, శ్రావణ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమలతున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కోదాడ పట్టణానికి చెందిన నండూరి వేద మనోజ్ఞ దంపతులు రూ.25,116, నిడుమోలుకు చెందిన ఎండూరి లిఖిత రమ్య దంపతులు రూ.14,116లను ఈవో సాంబశివరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మమద్ ఇంతియాజ్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో కవి ఎస్ఆర్ పృథ్వీ రచించిన పగిలిన జీవ కలలు దీర్ఘకవిత, నానో ప్రస్తానం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పగిలిన జీవన కలలు గ్రంథాన్ని ఆవిష్కరించిన ఇంతియాజ్ మాట్లాడుతూ కవిత్వంలో సామాజిక స్పృహ కనిపించాలన్నారు. కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. సభను ప్రారంభించిన కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు నేడు కవిత్వంలో వస్తున్న మార్పులను వివరించారు. నానో ప్రస్తనం లఘు కవితా సంపుటిని డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్‌వీ రమణ ఆవిష్కరించారు. సభకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు మంజులూరి కృష్ణకుమారి, కావూరి సత్యవతి, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, రచయిత పృథ్వీ పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్యాంజలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా ఆదివారం పలువురు కళాకారులు తమ కళాప్రదర్శనలతో అందరినీ అలరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద విజయవాడకు చెందిన కోలాట బృందం కోలాటాన్ని ప్రదర్శించింది. సాయంత్రం విజయవాడకు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కంచికచర్ల: ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాల పేరుతో లెక్కలు కట్టి సంతకాలు పెట్టి మరీ ప్రజలకు బాండ్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు, తీరా అధికారంలోకి వచ్చాక ఆ పథకాల ఊసే ఎత్తకపోతుండటం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి విమర్శించారు. కళ్లార్పకుండా మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని ఎద్దేవా చేశారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల పట్టణంలోని ఓసీ క్లబ్ ఫంక్షన్ హాలులో ఆదివారం నందిగామ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయకుండా సీఎంచంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న జిమ్మిక్కులపై ప్రజలకు అవగాహన కల్పించే విధానంపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కూటమి నాయకుల ఎన్నికల మేనిఫెస్టోను గుర్తుచేసేలా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను నేతలు ఆవిష్కరించారు.

సూపర్ సిక్స్ పథకాల అమలు ఎక్కడ?..



కార్యక్రమానికి ఆ పార్టీ మండల కన్వీనర్ బండి మల్లికార్జునరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథి మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా నేటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపాలనలో కరోనా సమయంలో కూడా అన్ని పథకాలను అమలుచేశారని గుర్తు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అమ్మఒడి పథకం పేరును తల్లికివందనం కూటమి ప్రభుత్వం మార్చిందన్నారు. అసలు ఆ పథకం మంత్రి లోకేష్ ఆలోచనల నుంచే వచ్చిందన్న సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎన్నికల హామీలను అమలుచేయని సీఎం చంద్రబాబును రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు.



సూపర్ సిక్స్ పథకాల క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డి, దేవినేని అవినాష్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్, తన్నీరు నాగేశ్వరరావు

ప్రజలను మోసం చేశారు... దేవినేని అవినాష్



వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వంలో జగన్ ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశారని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసునని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో గెలుపు కోసం అనేక హామీలు ఇచ్చి, తీరా ఇప్పుడు ఆ హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంపై సమావేశం నిర్వహించాలని పార్టీశ్రేణులకు సూచించారు.

అధికారం వస్తే సత్తా చూపిస్తాం : ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మండిపడ్డారు. మాజీఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావుపై, తనపై, చివరికి న్యాయవాదులు, జర్నలిస్టులపై కూడా నందిగామ కూటమి నాయకులు అక్రమ కేసులు పెట్టించారన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రెండునెలల్లో టీడీపీ శ్రేణులకు చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు పెట్టి ఇబ్బందిపెడుతున్న వారికి భవిష్యత్‌లో చట్టపరిధిలోనే బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు.

దుర్మార్గపు చర్యలు మానుకోవాలి : మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇకనైనా టీడీపీ నాయకులు తమ దుర్మార్గపుచర్యలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని హితవు పలికారు. నందిగామ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కూటమి నాయకులు దౌర్జనాలు మానుకుని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీలు షేక్ మలక్‌బషీర్, పెసరమల్లి రమాదేవి, కోటేరు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, పార్టీ మండల కన్వీనర్లు చందు, కందుల నాగేశ్వరరావు, నాయకులు మార్త శ్రీనివాసరావు వేమా సురేష్‌బాబు, కాలవ పెదబాబు, పాడిబండ్ల హరిజగన్నాధరావు, కాలవ వాసుదేవరావు, మంగునూరు కొండారెడ్డి, షేక్ షహనాజ్‌బేగం, కోటేరు ముత్తారెడ్డి, ఆవల రమేష్ పాల్గొన్నారు.

బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై దాడి హేయమైన చర్య



పెనుగంచిప్రోలు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీసీ మహిళా ప్రజాప్రతినిధి ఉప్పాల హారికను దుర్భాషలాడుతూ ఆమెకారుపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు మండిపడ్డారు. పెనుగంచిప్రోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సాక్షాత్తూ పోలీసుల సమక్షంలోనే ఉప్పాల హారిక కారుపై టీడీపీ, జనసేన నాయకు లు దాడులకు పాల్పడటం రాష్ట్రంలో కూటమి పాల న తీరుకు అద్దంపడుతోందన్నారు. దాడికి పాల్పడినవారిని అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో బీసీల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. బీసీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి భవిష్యత్‌లో గట్టిగా బుద్ధి చెప్పేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కఠినంగా శిక్షించాలి..

ఉప్పాల హారికపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని పూసల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చేని కుమారి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇద్దరికి గాయాలు

వీరులపాడు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన వీరులపాడు మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు..మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన మెరుగుమాల సిద్దు వెల్లంకి నుంచి ఆదివారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా విజయవాడకు చెందిన పెసరమల్లి కృష్ణకుమార్ స్కూటీపై కొణతాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోకరాజుపల్లి గ్రామశివారులో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో వారిద్దరూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న సీవీ వెంకటేశ్వర్లు, ఎస్‌వి అర్జున్ దంపతులు



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐల కుటుంబసభ్యులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు ఆషాడమాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు మల్లెపూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడితోటల్లో సేద తీరారు.

సారె సమర్పించిన జగ్గయ్యపేట సర్కిల్ పోలీసులు..

శ్రీతిరుపతమ్మవారికి జగ్గయ్యపేట సర్కిల్ సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సారె సమర్పించి బోనాలు చెల్లించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సారె తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, చిల్లకల్లు, జగ్గయ్యపేట, వత్సవాయి ఎస్ఐలు ఎంఎస్‌కె అర్జున్, సూర్యశ్రీనివాస్, రాజు, ఉమామహేశ్వరరావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల తీరుకు నల్లబ్యాడ్జీలతో నిరసన



బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న తన్నీరు, నాయకులు

వత్సవాయి: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన శ్రేణులు దాడి చేయడం పిరికిపంద చర్య అని జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. హారికపై దాడికి నిరసనగా ఆదివారం వత్సవాయి మండలంలోని పెంట్యాలవారిగూడెం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన మహిళపై ఇలా దాడులకు దిగడం, అసభ్యకరమైన మాటలు మాట్లాడటం కూటమి నాయకుల దుశ్చర్యలకు నిదర్శనమన్నారు. మహిళలపై దాడులకు దిగితే సహించేది లేదన్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏ కలుగులో దాక్కున్నారన్నారు. హారిక దంపతులపై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి నంబూరి రవి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు కనగాల రమేష్, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచ్‌లు వడ్డే పరమయ్య, కొట్టె నగేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, నియోజకవర్గ యువత అధ్యక్షులు ఎస్.వెంకటేష్, ఎం.నరేష్, బాజీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తూనం రమేష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న తన్నీరు తదితరులు

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): అప్పుల బాధ తట్టుకోలేక ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కౌలురైతు తూనం రమేష్ కుటుంబసభ్యులను జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ సమన్వకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ తూనం రమేష్ గతేడాది ఆరు ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టగా, రూ.6లక్షల వరకు అప్పులయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం మిర్చికి సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో అప్పుల తీరే దారి కనబడక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. రమేష్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తనవంతుగా రూ.10వేలను ఆర్థిక సాయం అందించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రూ.20వేలు ఇస్తామన్న హామీని అమలుచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు కనగాల రమేష్, మండల విభాగం అధ్యక్షుడు చిరుమామిళ్ల శ్రీను, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచ్‌లు వడ్డే పరమయ్య, కొట్టె నగేష్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర సంయుక్తకార్యదర్శి మండవ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి రూప్లానాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నరమనేని వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాలు వీరరాఘవ, మాజీ సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, వత్సవాయి గ్రామపార్టీ అధ్యక్షులు నరేష్, మైనార్టీ నాయకులు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం



శ్రీనివాసగౌడ్‌ను సన్మానిస్తున్న సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ఏలూరి శివాజీ

జగ్గయ్యపేట: కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సకాలంలో విత్తనాలు, ఎరువులను రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతంలో ఎరువులను అధికధరలకు విక్రయిస్తున్నా, పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చిల్లకల్లు గ్రామానికి చెందిన మండవ శ్రీనివాసగౌడ్‌ను నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల రైతు విభాగం అధ్యక్షులు గూడపాటి శేషయ్య, నాయకులు మోరె దుర్గాప్రసాద్, పిడిమర్తి బాబు, సురేష్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్రగాయాలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలో కొండపై నుంచి ఓ కార్మికుడు కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బుద్దు అనే కార్మికుడు ఓ క్వారీలో కొండపై గాతాలు పెడుతున్నాడు. ఈ క్రమంలో కార్మికుడు ప్రమాదవశాత్తూ కొండపై నుంచి కింద పడటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వైద్య చికిత్స కోసం అతన్ని ప్రైవేట్‌వాహనంలో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



ఊరేగింపుగా సారె తీసుకువెళ్తున్న దత్తసమాజం మహిళలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి ఆదివారం ఐతవరం గ్రామానికి చెందిన మహిళలు ఆషాడం సారె సమర్పించారు. మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు పూలు, పండ్లు, పసుపుకుంకుమ, చీరలతో కూడిన సారెను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: ఆషాఢమాసం సందర్భంగా మండల దత్త సమాజం, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో నందిగామలోని పలు ఆలయాలలో అమ్మవార్లకు భక్తులు సారె సమర్పించారు. పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారు, వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, సీతారామాంజనేయ స్వామి, రామలింగేశ్వర స్వామి, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాల్లోని అమ్మవార్లకు సారె సమర్పించి పూజలు చేశారు. మరిడీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం అన్నదానం చేశారు.

● నేడు ఆలయంలో హక్కుల వేలం

నందిగామ రూరల్: అంబారుపేటలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు పలుహక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో పవన్ కళ్యాణ్ తెలిపారు. లడ్డూప్రసాదం సరుకుల సరఫరా తదితర హక్కుల వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఈవో సూచించారు.